ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 5 జూన్ 2025



బీఈడీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల్లోని విద్యార్థుల మూడో సెమిస్టర్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. మొత్తం 14 బీఈడీ కళాశాలల నుంచి 1,036 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 944 మంది (91.12 శాతం) ఉత్తీర్ణులయ్యారు. జ్ఞానభూమి పోర్టల్, వర్సిటీ వెబ్‌సైట్‌లో ఫలితాలను పొందుపర్చామని పరీక్షల విభాగం డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఫలితాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా 15 రోజుల్లోపు పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

కూటమి సంబరాలు

- ప్రజా పాలనకు ఏడాది పూర్తి
- బాణసంచా కాల్చి శ్రేణుల సందడి

రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన ముగిసి, ప్రజా పాలన ప్రారంభమై బుధవారం నాటికి ఏడాది పూర్తయింది. దీంతో జిల్లాలో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగన్ పాలనలో ఐదేళ్ల పాటు ఎన్నో దోపిడీలు, అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభి వృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన సంబరాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్తి వివరాలు 8లో..


టెక్కలి జనసేన కార్యాలయం వద్ద..


ఆమదాలవలసలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం

7లో

బాబోయ్ కుక్కలు

- మునిసిపాలిటీలో విచ్చలవిడిగా సంచారం
- పట్టించుకోని యంత్రాంగం
- ఆందోళనలో ఇచ్ఛాపురం పట్టణవాసులు

7లో

ప్రమాదంలో పర్యావరణం

- గాలి, నీరు కాలుష్యం
- ప్రకృతి వనరుల పరిరక్షణకు ఇదే తరుణం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



6లో

యువత అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళికలు

- ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు
- మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ చైర్మన్ విజయకుమార్

6లో

చారిత్రక కట్టడంగా గుర్తించండి

- బ్రిటిష్ కాలంలో ఖజానా కార్యాలయంగా..
- స్వాతంత్ర్యం తర్వాత పశువైద్యశాలగా..
- ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనం



7లో

మరోసారి తప్పు చేస్తే చర్యలు

- ఐసీడీఎస్ సీడీపీవో విమలారాణి
- జి.పోలూరు కేంద్రంలో కుళ్లిన కోడి గుడ్ల సరఫరాపై విచారణ


గుడ్లను పరిశీలిస్తున్న సీడీపీవో విమలారాణి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మరోసారి కుళ్లిన కోడి గుడ్లను సరఫరా చేస్తే బాధ్యు లపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీవో విమలారాణి హెచ్చరించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ఈ గుడ్లు తినేదెలా కథనంపై ఆమె స్పం దించారు. ఈ మేరకు బుధవారం ఉద యం గేదెలపోలూరు అంగన్‌వాడీ కేంద్రా నికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ కేం ద్రంలో పలువురు (మిగతా 6వ పేజీలో)

ఐదు లక్షల మొక్కలు నాటాలి

- లక్ష్యాలు చేరకుంటే చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'ప్రకృతి పరిరక్షణకు ఒక్కరోజే (మిగతా 6వ పేజీలో)

క్షణికావేశంలో హత్యలు



- ఆరు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో ఘటనలు
- వివాహేతర సంబంధాలు, ఆస్తి తగదాలే కారణం
- కుటుంబాల్లో కానరాని మానవతా విలువలు
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న కేసులు




- గత నెల 17న సోంపేట మండలం పాలవలసకు చెందిన గోకర్ల ఈశ్వరరావు అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామ సమీపంలోని తోటల్లో యువకుడ్ని హతమార్చారు. ఆయన గొంతుతో పాటు శరీరంలో గాజు సీసాలు బలంగా దింపినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.




- ఈ ఏడాది ఏప్రిల్ 19న రణస్థలం మండలం పైడిభీమవరం జంక్షన్ సమీపంలోని చెరువు వద్ద భవాని అనే మహిళ దారుణ హత్యకు గురైంది. స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేసే ఆమెను చెరువు వద్దకు పిలిచి గొంతుకోశాడు నిందితుడు. వివాహేతర సంబంధం మాటున ఈ హత్య జరిగినట్టు పోలీసు విచారణలో తేలింది. పోలీసులు నిందితుడ్ని పట్టుకుని జైలుకు పంపించారు.

- ఈ ఏడాది జనవరి 20న శ్రీకాకుళం న్యూ కాలనీలో 50 ఏళ్ల మహిళ దారుణ హత్యకు గురైంది. పొందూరు మండలానికి చెందిన ఆమె న్యూకాలనీలోని ఓ ప్లాట్‌లో విగత జీవిగా పడి ఉండడాన్ని గుర్తించారు. శరత్ అనే వ్యక్తి ఆమెను హత్యచేసినట్టు పోలీసులు గుర్తించారు. ఆర్థిక, వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసుల విచారణలో తేలింది.

- గత ఏడాది డిసెంబరు 16న ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస గ్రామానికి చెందిన దామోదర పద్మ అనే మహిళ దారుణ హత్యకు గురైంది. ఆమె భర్త మూడేళ్ల కిందట చనిపోగా ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటోంది. ఈ తరుణంలో సురేష్ అనే వ్యక్తి చనువు పెంచుకున్నాడు. వారి సాన్నిహిత్యం శారీరక సంబంధానికి దారితీసింది. అయితే ఆమె సురేష్‌ను దూరం పెట్టడంతో తట్టుకోలేక అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి హత్య చేశాడు.




- గత నెల 8న కోటబొమ్మాళిలో పట్టపగలే లక్ష్మి అనే మహిళను గొంతు కోసి నరికి చంపేశాడు ఆమె భర్త తిరుపతిరావు. దంపతులిద్దరి మధ్య విభేదాలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో లక్ష్మి బ్యూటీ పార్లర్ నడుపుకుంటూ జీవనోపాధి పొందుతోంది. దీంతో అనుమానం పెంచుకున్న భర్త తిరుపతిరావు ఆమెతో గొడవకు దిగాడు. అందరూ చూస్తుండగానే పదునైన ఆయుధంతో గొంతుకోసి పరారయ్యాడు. దీంతో ఇద్దరు పిల్లలు ఒంటరయ్యారు.

రణస్థలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆరు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో హత్యలు జరిగాయి. క్షణికావేశానికి గురై కొంతమంది ఇటువంటి హత్యలకు పాల్పడుతున్నారు. కుటుంబసభ్యులే హంతకులుగా మారుతున్నారు. వివాహేతర సంబంధాలు, ఆస్తి తగదాలతో రక్త సంబంధీకులు, కట్టుకున్న భార్యాభర్తలు ఒకరినొకరు హతమార్చుకుంటున్న ఘటనలు జిల్లాలో వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. వివాహేతర సంబంధాల వల్లే ఎక్కువగా హత్యలు జరుగుతున్నాయి. సహ ధర్మచారి వేరొకరితో శారీరక సంబంధం పెట్టుకోవడాన్ని తట్టుకోలేక క్షణికావేశానికి గురై హత్యలకు తెగబడుతున్నారు. తమ పిల్లలను అనాథలను చేస్తున్నారు.

మారుతున్న మర్డర్ల తీరు..

ప్రస్తుతం హత్యలు చేసేందుకు పన్నుతున్న పన్నాగాలు విస్తుగొలిపేలా ఉంటున్నాయి. వివాహేతర సంబంధాలతో భార్య ప్రియుడితో కలిసి భర్తలను హతమార్చుతున్న ఘటనలు ఎక్కు వగా బయట పడుతున్నాయి. వివాహ బంధంతో కలిసి ఉండేందుకు ఇష్టపడకపోవడం, విడిపోవాలంటే వెంటనే వీలుకాకపోవడం వల్ల కూడా హత్యలు పెరుగుతున్నాయి. మరోవైపు మద్యం, గంజాయి మత్తులో మనిషి విచక్షణ కోల్పోతుంటాడు. ఆ సమయంలో మాటామాటా పెరిగి హత్యలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఒక మనిషి హత్య చేసే పరిస్థితికి వచ్చాడంటే దాని చుట్టూ చాలావరకూ పరిణామాలు జరిగి ఉంటాయి. మద్యం మత్తులో జరిగిన ఘాతుకాలే అధికంగా ఉన్నాయి. పైగా జిల్లాలో విచ్చలవిడిగా పట్టుబడుతున్న గంజాయి చూస్తుంటే ఏ స్థాయిలో వినియోగిస్తున్నారో అర్థం అవుతోంది. అందుకే (మిగతా 6వ పేజీలో..)

సెల్‌ఫోన్లతో మరిన్ని అనర్థాలు..

సెల్ ఫోన్లను సద్వినియోగం కంటే దుర్వినియోగానికే ఎక్కువగా వినియోగిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫోన్లలో పరిచయమైన అపరిచిత వ్యక్తులతో మాటలు కలపడం, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకోవడం అనేక అనర్థాలకు కారణమవుతున్నాయి. వేరే వారితో పెట్టుకునే వివాహేతర సంబంధాలు సజావుగా సాగుతున్న సంసారంలో చిచ్చులు పెడుతున్నాయి. హత్యలకు దారితీస్తున్నాయి. వివాహేతర సంబంధాలు, ఆస్తుల తగదాలతో హత్యలుచేసి పోలీసులను పక్కదారి పట్టించాలని చూస్తున్నారు. చివరికి కటకటాలపాలవుతున్నారు. హత్యలకు సహకరించిన వారికీ శిక్షలు పడుతున్నాయి. వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

విత్తన ఎంపికే కీలకం

- నకిలీ విత్తనాలతో జాగ్రత్త
- కొనుగోలుపై అవగాహన తప్పనిసరి
- ఖరీఫ్‌నకు సమాయత్తమవుతున్న రైతులు

హిరమండలం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం వర్షాలు దండిగా కురుస్తున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ కోసం సన్నద్ధమవుతున్నారు. పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలిస్తే నెల రోజుల్లో విత్తనాలు జల్లే పనులు చేపట్టనున్నారు. అయితే, పంట బాగుండాలన్నా..అధిక దిగుబడులు రావాలన్నా.. తెగుళ్లు తట్టుకోవాలన్నా విత్తన ఎంపికే కీలకం అంటున్నారు వ్యవసాయ నిపుణులు. ఈ సీజన్‌లో కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ రైతులను మభ్యపెడుతుంటారు. దీంతో రైతులు ఆకర్షితులై వాటిని కొనుగోలు చేస్తుంటారు. అయితే, ఈ విత్తనాలు చాలా వరకు మొలకలు రావు. ఒకవేళ మొలకలు వచ్చినా గింజలు పొల్లిపోవడం, సరైన దిగుబడి రాకపోవడం జరిగి రైతులు (మిగతా 6వ పేజీలో)




క్యాబినెట్ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు

ఉద్దానానికి సురక్షిత నీరు

- ఎన్టీఆర్ సుజల పథకం కింద నిధులు మంజూరు
- క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఆమోదం

శ్రీకాకుళం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉద్దానం ప్రాంతానికి సురక్షిత నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై తీసుకున్న పలు నిర్ణయాలను మంత్రిమండలి ఆమోదించింది. ఎన్టీఆర్ సుజల పథకం కింద ఆర్వో ప్లాంట్ ద్వారా ఉద్దానం ప్రాంతానికి సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. రూ.5.75కోట్లు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు నిర్ణయం తీసుకుంది. దీనివల్ల పలాస, వజ్రపుకొత్తూరు, కవిటి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, మందస మండలాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందుతుంది. ఈ క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, హోంశాఖ మంత్రి అనిత తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి సర్వం సిద్ధం

- రేపటి నుంచే పరీక్షలు ప్రారంభం
- 30 వరకు నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో ఐదు కేంద్రాలు, ఒడిశాలో ఒకటి
- 543 పోస్టులకు 22,648 మంది అభ్యర్థుల పోటీ

నరసన్నపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-25కి సర్వంసిద్ధమైంది. శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ నెల 30 వరకు జరగనున్నాయి. దీని కోసం ఉమ్మడి జిల్లాలోని ఐదు కేంద్రాలు, ఒడిశా రాష్ట్రం బరంపురంలో ఒక కేంద్రాన్ని కేటాయించారు. 44 సెషన్స్‌లో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాలకు సంబంధించి డిపార్ట్‌మెంట్ అధికారులుగా సమీపంలో ఉన్న ఎంఈవోలను నియమించారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు ఇప్పటికే అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు జారీ చేశారు. అయితే, కొన్ని సబ్జెక్టులకు చెందిన అభ్యర్థులకు సుదూర ప్రాంతాల్లో కేంద్రాలు కేటాయించడంతో ఆందోళన చెందుతున్నారు.



షెడ్యూల్ జారీ

సబ్జెక్టుల వారీగా డీఎస్సీ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు షెడ్యూల్ జారీ చేశారు. శుక్రవారం టీజీటీ పరీక్షతో డీఎస్సీ ప్రారంభంకానుంది. 9 నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్, నాన్ లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్ల పరీక్షలు నిర్వహించనున్నారు. ఎక్కువ మంది రాసే ఎస్జీటీ పరీక్షలు 13వ తేదీ నుంచి జరగనున్నాయి. టెట్ లేని పీడీ, పీఈటీలకు 100 మార్కులు పేపరు ఉన్న పరీక్షలకు మూడు గంటలు, టెట్ వెయిటేజ్ ఉన్న పోస్టుల (మిగతా 6వ పేజీలో)

- గాలి, నీరు కాలుష్యం
- ప్రకృతి వనరుల పరిరక్షణకు ఇదే తరుణం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రమాదంలో పర్యావరణం

ఓవైపు మనుషుల దురాశ... మరోవైపు ప్రకృతి విపత్తులు... చెట్లను కూలుస్తున్నాయి. పర్యావరణానికి హాని తల పెడుతున్నాయి. గాలి.. నీటి కాలుష్యం పెరుగుతోంది. నదులు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయి. ఫలితంగా వాతావరణంలో అనూహ్య మార్పులు.. ఉష్ణోగ్రతల్లో తేడాలు... ఇవన్నీ ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించగలమో.. లేదోననే సందేహాలను లెవనెత్తుతున్నాయి. ఈ తరుణంలో అక్కడక్కడా కొంత మంది ప్రకృతి ప్రేమికులు.. స్వచ్ఛంద సేవకులు మొక్కల పెంపకానికి.. పచ్చదనం పరిరక్షణకు పూనుకోవడం కొంతలో కొంత ఊరటనిస్తోంది.

మొక్కల కోసం ఓ సైన్యం..



బోనెల గోపాల్

పలాస, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణం అంటే చిన్నతనం నుంచి ఆయనకు ఎంతో ప్రేమ. మొక్కలు పెంచడం అంటే ఒక కొత్తతరాన్ని అందించడమే అని ఆయన భావిస్తాడు. ఈ కారణంగానే మొక్కలు నాటేందుకు గ్రీన్ ఆర్మీ అనే స్వచ్ఛంద సంస్థ (సైన్యం)ను స్థాపించి... జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు కాశీబుగ్గ పట్టణానికి చెందిన బోనెల గోపాల్. పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు బలవడం... ప్రకృతి విలయానికి వేలాది చెట్లు నేల కూలడం వంటి సంఘటనలు ఆయనను తీవ్రంగా కలచి వేశాయి. ముఖ్యంగా 2018లో ఈ ప్రాంతంలో సంభవించిన తితలీ తుఫానుకు రెండు లక్షలకు పైగా చిన్నాపెద్దా చెట్లు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. ఈ ప్రాంతంలో పర్యావరణ సమతుల్యం పూర్తిగా దెబ్బతింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని.. మొక్కలు నాటడం తన ఒక్కడితో సాధ్యం కాదని గుర్తించారు. ఈమేరకు 'గ్రీన్ ఆర్మీ'ని స్థాపించారు. పుట్టిన రోజులు, ఎక్కడైనా శుభకార్యాలలో సాధారణంగా బహుమతులు ఇవ్వడం పరిపాటి. కానీ ఆర్మీ సభ్యులు ఒక్కో మొక్క ఇస్తూ... వాటిని పరిరక్షించే బాధ్యతను కూడా అప్పగిస్తారు శుభకార్యాల్లో డబ్బులు వృథా చేయకుండా మొక్కలను డొనేషన్లుగా తీసుకొని సెలవు రోజుల్లో గ్రామాల్లో నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకుంటున్నారు. గోపాల్ తన నెల సంపాదనలో రూ.ఐదు వేలు, తన భార్య బోనెల లక్ష్మి సంపాదనలో రూ.5వేలు మొత్తం రూ. పది వేలు వెచ్చించి మొక్కలు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం ఆయన రెంటికోట పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. ఆయన భార్య లక్ష్మి కాశీబుగ్గ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలు. ఇప్పటి వరకూ గ్రీన్ ఆర్మీలో 200 మంది వరకూ సభ్యులు ఉండగా... జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల కాలంలో 20 వేలకు పైగా మొక్కలు నాటి రికార్డు సృష్టించారు. ఇందులో 5వేల మొక్కలకు పైగా ఏపుగా పెరిగినట్లు తమ గణాంకాలు చెబుతున్నా యని గోపాల్ తెలిపారు. రానున్న రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా తీసుకువచ్చే ఆలో చనలో ఉన్నామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన కోరుతున్నారు.



విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు



ఒడిశాలోని మహేంద్రగిరి ప్రాంతంలో ఆదివాసీలను ఉత్తేజపరుస్తూ..

కొండలకు పచ్చదనం తెస్తూ..

పలాస రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో చెట్లు తరిగిపోతుండడం... పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుండం... ఉష్ణోగ్రతలు... కాలుష్యం పెరుగుతుండడం మనకు తెలిసిందే. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా ఎంతో కొంత తోడ్పడే ప్రయత్నం చేస్తున్నారు కొత్తపల్లి చిన్నాచారి. పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందినఆయన గత 22 ఏళ్లుగా మొక్కల పెంపకానికి తనవంతు కృషి చేస్తున్నా రు. తర్లాకోట నుంచి గొప్పిలి మీదుగా మహేంద్ర గిరుల వరకూ (ఒడిశాలోని నారాయణపూర్) ప్రతి శని, ఆదివారాల్లో వివిధ మొక్కలకు సం బంధించిన విత్తనాలు విసరుతూ.. అవి మొలిచి.. పెద్దయ్యే వరకూ పర్యవేక్షిస్తున్నారు. ఆయన బృందం వేకువ జామున బయలుదేరి మరలా ఉదయం 10 గంటల లోపు తిరిగి రావడం గత పదిహేనేళ్లుగా అలవాటుగా మారిందన్నారు. తమ ఊరితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కొండలపైన ఖాళీ అవుతున్న ప్రదేశాలలో మొక్కలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. హరి సాగరం, తర్లాకోట పెద్ద చెరువుతో పాటు గొప్పిలి వైపు ఇరు వైపులా చెట్లను నాటారు. మే నెలలో గొప్పిలి మీదుగా నారాయణపూర్ జంక్షన్ వరకూ వెళ్లి... అక్కడి నుంచి మహేంద్ర కొండల మీదుగా విత్తనాల బాల్స్‌ను వేశారు. ఆ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలకు మొక్క లను అందించి వాటి విలువను తెలియజేశారు. ఇలా నిరంతరం మొక్కల పెంపకాని కి.. పర్యావరణ పరి రక్షణకు కృషిచేస్తున్న చిన్నాచారి ఈ ప్రాంతీయుల అభిమానాన్ని చూరగొంటున్నారు.



సీసాలలో సిద్ధం చేసిన మొక్కలు



ఏడు రోడ్ల జంక్షన్‌లోని పాత వంతెన వద్ద కలుషితమైన నాగావళి నీరు

కాలువ అనుకునేరు... ఇదీ మన నాగావళి తీరు



డేఅండ్‌నైట్ కూడలికి సమీపంలో నాగావళి ఇలా..

శ్రీకాకుళం అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇంత పెద్ద మురుగు కాలువ ఎక్కడ ఉందా.. అని అనుకుంటున్నారా? మరోసారి పరిశీలించండి. అది మురుగు కాలువ కాదు. శ్రీకాకుళం జిల్లాతో తరతరాల అనుబంధం గల నాగావళి నది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన నాగావళి ప్రస్తుతం చెత్తాచెదారాలు.. ఆసుపత్రుల వ్యర్థాలు, జంతు కళే బరాలతో నిండిపోయి దుర్గంధ భరితంగా మారింది. అడపాదడపా కొన్ని స్వచ్ఛంద సంస్థలు.. పర్యావరణ ప్రేమికులు, అధికార యంత్రాంగం... నాగావళి నదీతీరంలోని పాత వంతెన, కోటేశ్వరాలయంతో పాటు మరికొన్ని ప్రదేశాల్లో పరిశుభ్రం చేయడం... ఆ తరువాత పరిస్థితి మొదటికి రావడం అలవాటుగా మారింది. శ్రీకాకుళం నగరం వివిధ ప్రాంతాల్లో నదిలో నీరు మురుగునీటి కాలువ కంటే దారుణంగా ఉంది. శ్రీకాకుళం నగర ప్రజలకు తాగునీరు అందించే వ్యవస్థ కూడా నాగావళి నదీ తీరంలోనే ఉంది. నదీ జలాలు కలుషితం కాకుండా కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మున్సి పల్ కార్పొరేషన్ యంత్రాంగంతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు... మాంసాహార దుకాణాల వారు... ప్రజలు కూడా నదీ తీరాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని గుర్తించాలి. దీనిపై అధికార యంత్రాంగం ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఈ చిత్రం గుర్తు చేస్తోంది.

క్షణికావేశంలో హత్యలు

(ఐదో పేజీ తరువాయి)

మద్యం మత్తులో ఉండేవారితో వీలైనంతగా వాదనలు పెట్టుకోకూడ దని నిపుణులు సూచిస్తున్నారు.

మానవతా విలువలు పెరగాలి..

మనిషిలో మానవతా విలువలు పెరగాలి. అప్పుడే జీవనం బాగుంటుంది. సాఫీగా ముందుకు సాగుతుంది. భార్య, భర్త ఇద్దరూ ఇష్టం లేకుండా కలిసి జీవించడం చాలా కష్టం. అందుకే ఒకరి అభిప్రాయాలను ఒకరు తెలుసుకొని వివాహ బంధంతో ఒక్కటి కావాలి. అలా కాకుండా పెళ్లి చేసుకున్న తరువాత వారి జీవితంలో వేరేవారు చేరడంతో వివాహేతర సంబంధాలకు దారితీస్తోంది. పెరుగుతున్న ఆస్తి విలువతో డబ్బే ప్రధానంగా మారి రక్తసంబంధీకులనే హత్యచేసే స్థాయికి తీసుకొస్తుంది. మనకున్న దానితో సంతృప్తి చెందడం ప్రశాంత జీవనానికి ముఖ్యం. ఇది గ్రహిస్తే అసలు అనర్థాలే జరగవు.

-బెండి సాయిరామ్, మానసిక వైద్య నిపుణుడు, శ్రీకాకుళం

మరోసారి తప్పు చేస్తే చర్యలు

(ఐదో పేజీ తరువాయి)

లబ్ధిదారులకు కుళ్లిన కోడి గుడ్లను సరఫరా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులను పిలిచి మళ్లీ మంచి గుడ్లను అందజేశారు. ఎండల కారణంగా గుడ్లను నిల్వ ఉంచడంతో కుళ్లిపోతున్నాయని తెలిపారు. లబ్ధిదారుల నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. వాటిని పీడీకి పంపిస్తామన్నారు. మరోసారి ఇలా జరిగితే కాంట్రాక్టర్‌తో పాటు కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో సూపర్‌వైజర్లు రేణుక, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు ఉండవా?

ఇంకోసారి తప్పుచేస్తే చర్యలు తీసుకుంటామని సీడీపీవో హెచ్చరించారు. దీన్నిబట్టి చూస్తే ఇప్పటి ఘటనను గాలికొదిలేసినట్లేనన్న చర్చ సాగుతోంది. తప్పుచేసిన వారిపై చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థులు కుళ్లిన కోడిగుడ్ల గురించి చెప్పినా 'ఇంకోసారి తప్పుచేస్తే..' అని సీడీపీవో అనడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు లక్షల మొక్కలు నాటాలి

(ఐదో పేజీ తరువాయి)

ఒక పెద్ద హరిత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి. ప్రతీ శాఖ, ప్రతీ మండలానికి స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయి. లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సహకరించకపోతే చర్యలు తప్పవు. అటవీశాఖ 1.5 లక్షల మొక్కలు, సచివాలయ సిబ్బంది లక్ష, జిల్లా పంచాయతీ సిబ్బంది 90వేలు, ఐసీడీఎస్ ద్వారా ప్రతీ అంగన్‌వాడీ 10 మొక్కలు, డ్వామా 2.5లక్షలు, ఇతర శాఖలు మరో 50వేల మొక్కలు నాటాలి. అటవీశాఖ, ఉద్యానవన శాఖ, కాలుష్య నియంత్రణ మండలి వంటి కీలక విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలి. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై విజయవంతం చేయాలి.'అని కలెక్టర్ కోరారు. 'ఒక్కరోజే పచ్చదనం కోసం పెద్ద అడుగు' అనే నినాదంతో ఈ కార్యక్రమం జరుగనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమం జిల్లాలో పచ్చదనం నింపడంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు.

డీఎస్సీకి సర్వం సిద్ధం

(ఐదో పేజీ తరువాయి)

పరీక్షలకు రెండున్నర గంటల సమయం కేటాయించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగనున్నాయి. నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకొని నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలకు గంటన్నర ముందుగా చేరుకోవాల్సి ఉంటుంది.

- ఉమ్మడి జిల్లాలో 22,648 మంది అభ్యర్థుల నుంచి 39,235 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 458 పోస్టులు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో 85 పోస్టులు ఉన్నాయి. మొత్తం 543 పోస్టులకు 22,648 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

నరసన్నపేట కోర్ టెక్నాలజీ, ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల, చిలకపాలెం శివానీ ఇంజనీరింగ్ కళాశాల, టెక్కలి ఐతమ్ కళాశాల, రాజాం జీఎమ్మార్, బరంపురం (ఒడిశా) ఐకాన్.



గొయ్యి మధ్యలో ఏర్పాటు చేసిన జెండాలు

ఆదమరిచారో అంతే..



ఎస్సీ వీధి వద్ద ప్రధాన రహదారిలో నీరు

కొత్తూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న పాలకొండ రహదారి మధ్యలో గొయ్యి... ఇదే రహదారిలో ఎస్సీ వీధికి సమీపంలో ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గోతులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వీటిని ప్రేక్షకుల్లా చూసేవారే తప్ప పూడ్చేవారు కనిపించడం లేదు. ఏ మాత్రం ఆదమరచినా ఆస్పత్రి పాలవ్వాల్సిందే. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో ఓ పక్క సిమెంట్ రోడ్డు... దానికి ఆనుకొని తారు రోడ్డు ఉన్నాయి. రెండింటికీ మధ్య పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ గోతిలో నిత్యం వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉంటున్నాయి. వాహనాలకు గొయ్యి కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతమంది స్థానికులు వాహనదారులకు ప్రమాద హెచ్చరికగా కర్రలకు జెండాలు కట్టి... గొయ్యి మధ్యలో పాతిపెట్టారు. దీంతో వాహనదారులు జాగ్రత్త పడుతున్నారు. ఇక్కడ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని రహదారులపై గోతులను పూడ్చేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

యువగళం పాదయాత్రపై పుస్తకం

- మంత్రి అచ్చెన్నకు అందజేసిన నారా లోకేష్

శ్రీకాకుళం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పిన యువగళం పాదయాత్రపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పుస్తకాన్ని ప్రచురించారు. బుధవారం క్యాబినెట్ సమావేశం సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో పుస్తక ప్రతిని మంత్రులకు లోకేష్ అందజేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడికి కూడా మంత్రి లోకేష్ ఈ పుస్తకాన్ని అందజేశారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు పుస్తకాన్ని అందజేస్తున్న మంత్రి నారా లోకేష్



నృత్యం చేస్తున్న నీరజ బృందం

వైభవంగా ఘటాల ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవతల సిరిమానోత్సవాల సందర్భంగా పాత శ్రీకాకుళంలో పెద్దమ్మ వారు, నూకాలమ్మలకు బుధవారం ఘటాల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సంతోషిమాత అమ్మవారి ఆలయ ఆవరణలో పెద్దమ్మ, నూకాలమ్మ తల్లి దేవర ఏర్పాట్లు చేశారు. వేయి కాళ్ల ఘట పూజ నిర్వహించారు. ఈ నెల 6వ తేదీ వరకు నిత్యం పరమాన్నం, అట్లు, బొబ్బట్లు, గారెలు, పులిహోర, పప్పు, అన్నం అమ్మవారికి నైవేద్యంగా పెడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాజీపేట నుంచి పెద్ద సిరిమాను చెట్టును తెప్పించి పూజలు నిర్వహించారు. రథం కూడా ప్రత్యేకంగా తయారు చేయించారు. ఈ సందర్భంగా నీరజా సుబ్రహ్మణ్యం బృందంతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు.

యువత అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళికలు

- ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు
- మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ చైర్మన్ విజయకుమార్



మాట్లాడుతున్న చైర్మన్ విజయకుమార్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాల యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం... వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి.. సహకారం అందజేస్తామని రాష్ట్ర మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయకుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. జిల్లాల వారీగా మానవ వనరులు, సహజ వనరులను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. తద్వారా మాల యువతకు సరైన ఉపాధి కల్పిస్తామన్నారు. యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సరైన అవగాహన లేదని, దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి ఇవ్వకుండా పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌కు రూ.341 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. మార్కెట్‌ను విశ్లేషించి.. డిమాండ్ ఉన్న రంగాలను గుర్తించి.. యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తామని ఆయన చెప్పారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మాల కార్పొరేషన్ డైరెక్టర్లు, సభ్యులు గతంలో ఇచ్చిన రుణాల వల్ల ఎదురైన సమస్యలను వివరించారు. అసలైన లబ్ధిదారులకే సాయం అందించాలని సూచించారు. ఎటువంటి సిఫారసులకు తావు లేకుండా జిల్లా అధికారుల సమక్షంలోనే లబ్ధిదారుల ఎంపిక జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, అధికారులు, కార్పొరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికే కీలకం

(ఐదో పేజీ తరువాయి)

నష్టపోతున్నారు. ఏటా నకిలీ విత్తనాల బారిన పడి అధిక సంఖ్యలో రైతులు మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజనల్ విత్తనాలు కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీనివల్ల నకిలీ విత్తనాలను ముందే గుర్తించవచ్చు. నష్టపోయినా పరి హారం సైతం పొందవచ్చని పేర్కొంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్నిచోట్ల ప్రభుత్వ అ నుమతి లేకుండా కొందరు వ్యాపారులు తెల్ల సంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉంది. వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ.. వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లును పంట చేతికి వచ్చేంత వరకు రైతులు భద్రపరుచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలు ఉంటేనే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకు రైతులు దాచుకోవాలి.

నకిలీ విత్తనాలపై ఫిర్యాదు చేయొచ్చు: ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు చెబు తున్నారు నకిలి విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధి కారులు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్ల దిగుబడి రాలేదని గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందేం దుకు వీలుంటుందని చెబుతున్నారు. దీని కోసం రైతులు విత్తన కొనుగోలు బిల్లును భద్రపరుచుకోవాల్సి ఉంటుందంటున్నారు.

తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న మెరైన్ ఎస్ఐ హరికృష్ణారావు

ఎచ్చెర్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాజీ దిబ్బలపాలెం, కొత్తమత్స్యలేశం, డి.మత్స్యలేశం గ్రామాల్లో కళింగపట్నం మెరైన్ ఎస్ఐ జి.హరికృష్ణారావు బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సముద్రతీరంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, అపరిచిత వ్యక్తులు ఎవరైనా కన్పించినా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. చేపలవేటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిషేధిత వస్తువులు రవాణా చేస్తే వెంటనే 1093, 93929 14712 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా బాలసుబ్రహ్మణ్యం జయంతి


బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

సోంపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (బాలు) జయంతి బుధవారం ఘనంగా జరిపారు సోంపేటలో రిటైర్డు పెన్షనర్ల ఉద్యోగుల సంఘ భవనంలో బాల సుబ్రహ్మణ్యం చిత్రపటానికి రిటైర్డు ఉపాధ్యాయులు దేవేంద్రనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలు పాడిన పాటలు పలువురు గాయకులు ఆలపించారు. కార్యక్రమంలో కళాకారులు గేదెల తిరుపతిరావు, జనగ జయరాం, మద్దిల హేమసుందర్, రిటైర్డు ఉపాధ్యాయులు రఘునాథ్ పాడి, ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో సాగు చేయాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సరుబుజ్జిలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రణాళికాబద్ధంగా సాగు చేస్తే ఆశించిన దిగుబడులు సాధ్యపడతాయని వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలస కృషి విజ్ఞాన క్రేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఖరీఫ్ ముందస్తు ప్రణాళికా సదస్సును బుధవారం పెద్దపాలెంలో నిర్వహించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు శైలజ, చింతాడ బాల కృష్ణ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు ప్రాధాన్యంపై వివరించారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ


సర్టిఫికెట్లతో క్రీడాకారులు

రణస్థలం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, శరీర దారుఢ్యం కోసం నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ బుధవారంతో ముగిసిందని అంబేడ్కర్ యునివర్సిటీ పీడీ మన్నేల శ్రీనివాసరావు తెలిపారు. గత నెల 7న 40 మంది విద్యార్థులకు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో వాలీబాల్, వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. స్థానిక యూత్ క్రీడాకారులకు గుడ్లు, హార్లిక్స్, అరటి పండ్లు, కొమ్ముశనగలు ఇచ్చినట్టు తెలిపారు. 35 మంది విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిన్నింటి సత్యంనాయుడు, కొమనాపల్లి హరికృష్ణ, దుక్క రమణమూర్తి, నెమలపురి బాలరాజు, రాజాపంతులు సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాలపై దృష్టి సారించాలి



చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ

జి.సిగడాం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి సంపద కేంద్రాల వినియోగంపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. బుధవారం వెలగాడ, పెంట తదితర పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్తపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరుచేసేలా గ్రీన్ అంబాసిడర్లకు తెలియజేయాలన్నారు. పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్న కారణంగా పారిశుధ్యం పనులపై దృష్టి సారించాలన్నారు. ఈయన వెంట ఎంపీడీవో జి.రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

చారిత్రక కట్టడంగా గుర్తించండి



- బ్రిటిష్ కాలంలో ఖజానా కార్యాలయంగా..
- స్వాతంత్ర్యం తర్వాత పశువైద్యశాలగా..
- ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనం

గార, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కళింగపట్నంలో గ్రామ సచివాలయం పక్కనే ఉన్న బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ భవనాన్ని చారిత్రక కట్టడంగా గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ భవనం అప్పట్లో ఈ ప్రాంతానికి ఖజానా కార్యాలయంగా వినియోగించేవారిని స్థానిక పెద్దలు చెబుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ భవనం పశువైద్యశాలగా ఉపయోగించారు. దశబ్దాల చరిత్ర కలిగిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు ఊడిపోవడం, గోడలు బీటలు వారిపోయాయి. దీనిని చారిత్రక కట్టడంగా ప్రభుత్వం గుర్తించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై జిల్లా పర్యాటక శాఖ అధికారి మాట్లాడుతూ.. కళింగపట్నంలో బ్రిటిష్ కాలంలో నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి, ఆవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శిథిలావస్థకు చేరిన బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనం

సీఎం చంద్రబాబు రైతు పక్షపాతి

- ఎమ్మెల్యే కూన రవికుమార్


రైతులకు ఎరువులు అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల సాగుకు అవసరమైన సాగునీటి ప్రాజెక్టులతో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు తెలుగుదేశం పార్టీ పాలనలోనే అందిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతిగా గుర్తింపు పొందారని ఎమ్మెల్యే, పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. బుధవారం దూసిపేట గ్రామంలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన పాలొని మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి ఎం.మోహన్‌రావు ఆధ్వర్యంలో 2025 ఖరీఫ్‌సాగునకు రైతులకు రాయితీపై అందించే వరి విత్తనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ.. సాగులో కొత్త విధానాలు అవలంబించాలని, కొత్త వంగడాలను వాడాలన్నారు. వ్యవసాయంలో వాడకాన్ని, డ్రోన్స్ వినియోగం ద్వారా రైతులకు కలిగే లాభాలను డ్రోన్ ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. రైతన్నలు వ్యవసాయంలో పాత విధానాలను విడిచిపెట్టి కొత్త యాంత్రీకరణ పద్ధతులపై దృష్టి పెట్టాలని, తద్వారా మంచి దిగుబడులు రాబట్టుకోవచ్చునని వ్యవసాయాధికారులు అందించే సూచనలు పాటిస్తూ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, నారాయణపురం ఆనకట్టు ఛైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, రా ష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టీడీపీ నాయకులు తమ్మినేని అప్పలనాయుడు, ఎండ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా ఈ నెల 6వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కలివరం, దూసిపేట, తమ్మయ్యపే, కొర్లకోట, చీమలవలస, నెల్లిపర్తి, వెదుళ్లవలస, బొబ్బిలిపేట, చింతలపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలన్నారు.

శ్రీకాకుళం నగర పరిధిలో..

అరసవల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీ పరిధిలో గల 11కేవీ ఫీడర్ మెంటినెన్స్, లైన్ మరమ్మతు పనుల కోసం 6వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ పి.యోగీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఎన్ కాలనీ, కిమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఈ అంతరాయానికి విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒడిశా వాసి మృతి


భజరంగ మృతదేహం

ఎచ్చెర్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తమ్మినాయుడు పేట వద్ద జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడి శాకు చెందిన భజరంగ భగత్య(32) విశాఖ డాక్‌యార్డ్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై విశాఖ వెళ్తుంగా.. తమ్మినాయుడుపేట వద్ద గేదెను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజనాసుపత్రి లో చేర్పించగా, చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. భజరంగకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి బావమరిది ప్రమోద భగత్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాత శ్రీకాకుళం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.దుర్గారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. సైన్స్ గ్రూపులో ప్రవేశానికి రూ.2409, ఆర్ట్స్‌లో రూ.1419, ఒకేషనల్‌లో రూ.2189 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయని, ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

నగరంలో 'యోగాంధ్ర'


యోగాంధ్ర కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్థానిక 80 అడుగుల రోడ్డులో వెనుకబడిన తరగతుల సహకార సంఘం అధికారులు, సిబ్బందితో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. యోగా శిక్షకులు యోగాసనాలు, ధ్యాన సాధన చేయించారు. ప్రతీ రోజు ఉదయం గంట పాటు యోగాను సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా రక్షణ లభిస్తుందని బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ అన్నారు. కార్యక్రమంలో సుమారు 100 మంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు శ్రీకాంత్


శ్రీకాంత్ మహంతి

ఇచ్ఛాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సత్తాచాటి శ్రీకాంత్ మహంతి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బుధవారం పయనమయ్యాడు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో పశ్చిమబెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి యోగా పోటీల్లో శ్రీకాంత్ పాల్గొంటున్నాడు. గత నెల 4న విజయవాడ వీఎల్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా చాపియన్ షిప్ పోటీలో సత్తాచాటి బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా తోటి స్నేహితులు అభినందించారు.

ముగిసిన క్రీడా శిక్షణ శిబిరాలు



తైక్వాండో శిక్షణ పొందిన బాలబాలికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో టౌన్ హాల్ క్లబ్ వేదికగా నెల రోజులుగా నిర్వహిస్తున్న తైక్వాండో, ఫెన్సింగ్ క్రీడల వేసవి శిక్షణ శిబిరాలు బుధవారంతో ముగిశాయి. ఏపీ తైక్వాండో అసోసియేషన్ జిల్లా కోచ్ మజ్జి గౌతమ్ పర్యవేక్షణలో తైక్వాండో శిక్షణ ఇచ్చారు. ఆత్మరక్షణకు తైక్వాండో ఏ విధంగా దోహదపడుతుందో అనే విషయమై బాలబాలికలకు అవగాహన కల్పించారు. ఫెన్సింగ్ శిక్షణను కోచ్ జోగిపాటి వంశీ పర్యవేక్షణలో ఇచ్చారు. శిక్షణ శిబిరాలు నిర్వహించడంపై బాలబాలికలు, వారి తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తంచేశారు.

రుణాలన్నీ మాఫీ చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించిన రుణాలన్నీ తక్షణమే మాఫీ చేయాలని సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన స్థానిక కలెక్టరేట్ జరిగిన సమావేశంలో రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఎస్సీలకు నిలుపుదల చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, ప్రతినిధులు కల్లేపల్లి రామ్‌గోపాల్, టి.రమణ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు

- మునిసిపాలిటీలో విచ్చలవిడిగా సంచారం
- పట్టించుకోని యంత్రాంగం
- ఆందోళనలో ఇచ్ఛాపురం పట్టణవాసులు

ఇచ్ఛాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో కుక్కల బెడద రోజురోజుకి పెరిగిపోతుంది. కుక్కల దాడిలో పట్టణ ప్రజలు గాయాలై ఆసుపత్రి పాలవుతున్నారు. అయినా మునిసిపల్ అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారే తప్పా వీటి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పగలే కాకుండా రాత్రి పూట కూడా బస్టాండ్ జంక్షన్‌లో కుక్కలు రోడ్డుపైకి రావడంతో బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల దాడిలో ప్రయాణికులకు గాయపడిన ఘటనలు కూడా లేకపోలేదు. దీంతో బస్టాండ్‌కు వచ్చేందుకు ప్రయాణికులు బయపడుతున్నారు. కుక్కలను నివారణకు చర్యలు తీసుకోవాలని స్వయాన మునిసిపల్ సాధారణ సమావేశాల్లో పలుమార్లు వార్డు కౌన్సిలర్లు అధికారులకు ఫిర్యాదు చేయటం కూడా జరిగింది. అయినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతీరోజు కుక్కల దాడుల్లో ప్రజలు గాయాలు పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.


బస్టాండ్ జంక్షన్‌లో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు


రాత్రిపూట ఇలా..

గాలి, ఉరుములతో కూడిన వర్షం


పెంట గ్రామంలో కురుస్తున్న వర్షం

జి.సిగడాం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు చోట్ల బుధవారం గాలి, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేగావృతమై గాలివాన, మెరుపులతో కూడిన వర్షం పడింది. రెండు రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ఒక్కసారిగా వర్షం పడడంతో కొంత ఉపశమనం పొందారు. ఈ వర్షంతో వరినారు ముల్లు సాగుకు, మొక్కజొన్న వేసుకొనేందుకు ఎంతగానో ఉపయోగం అని రైతులు చెపుతున్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'



టెక్కలి: ర్యాలీలో పాల్గొన్న మాజీ స్పీకర్ తమ్మినేని, వైసీపీ శ్రేణులు

టెక్కలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినం నిర్వహించారు. టెక్కలిలో ఇందిరాగాంధీ కూడలి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఏవో రషీద్ మహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. సబ్‌కలెక్టర్ కార్యా లయం గేట్ వద్ద మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వడదెబ్బకు గురయ్యారు. దీంతో పక్కనే ఉన్న నాయకులు ఆయనకు సపర్యలు చేసి సబ్‌కలెక్టర్ కార్యాలయం లోపలికి తీసుకువెళ్లారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఇచ్ఛాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా పరిశీలకులు కుంబా రవిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించారు. దాసన్నపేట జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరకుని డీటీ శ్రీహరికి వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, తదిత రులు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏడాది పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో బుధవారం వైసీపీ నాయకులు నిరసన తెలిపారు. ఏడు రోడ్ల జంక్షన్ నుంచి ర్యాలీగా వచ్చి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వైసీపీ నాయకులు మామిడి శ్రీకాంత్, ఎ.సూరిబాబు, ఎంవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతోపాటు పలు డివిజన్ల పార్టీ ఇన్‌చార్జీలు పాల్గొనకపోవడం విశేషం.
- పలాసరూరల్/కాశీబుగ్గ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదై ప్రజలకు కేవలం బూటకపు మాటలు, చేతకాని హామీలతో మోసం చేసిందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పలాసలో వెన్నుపోటు దినాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు.
- పాతపట్నం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి చేపట్టిన పాలనలో వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బుధవారం వెన్ను పోటు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.
- రణస్థలం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నెరవేర్చని హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రామతీర్థం జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ వైసీపీ కార్యకర్తలు, నాయకులు వెన్నుపోటు నిరసన ర్యాలీ బుధవారం చేపట్టి తహసీల్దార్ ఎన్.ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.
- ఆమదాలవలస, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్ఐ గోవిందరావుకు వినతిపత్రం అందించారు.

వ్యక్తి ఆత్మహత్య



త్రినాథరావు (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని రెడ్డిక వీధిలోని ఓ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసు కుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రెడ్డికవీధిలో నివసిస్తున్న బత్తిని త్రినాథరావు (38) కార్పెంటర్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తన భార్య లక్ష్మితో తగాదాలు పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కూడా పూటుగా మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడి వేరొక గదిలోకి రాత్రి 11 గంటల సమయంలో వెళ్లిపోయి గడియ పెట్టుకున్నాడు. ఎప్పటిలాగే నిద్ర పోయాడనుకున్న భార్య ఉదయం లేచిన తర్వాత ఎంత పిలిచినా పలకకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా.. త్రినాథరావు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. ఎస్ఐ రామారావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇప్పిలి వీధి సచివాలయ వీఆర్వో తోట రాహిత్యాదేవి సమక్షంలో శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

కళా ప్రదర్శనకు వచ్చి..

● విశాఖ జిల్లా పెద గంట్యాడకు చెందిన వ్యక్తి మృతి



కల్యాణ్ మృతదేహం

కంచిలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని మఠం చెరువు వద్ద స్నానానికి వెళి గుండెపోటుకు గురై విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలానికి చెందిన కళాకారుడు సప్ప కల్యాణ్(65) బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు, తోటి కళాకారులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో జరుగుతున్న కంచమ్మతల్లి సంబరాల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కల్యాణ్ వచ్చాడు. మంగళవారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడలో జరిగిన సంబరాల్లో బాలకృష్ణ డూప్‌గా నటించిన కల్యాణ్.. కంచిలి సంబరాల్లో పాల్గొనేందుకు బుధవారం వేకువ జామున మండల కేంద్రానికి వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మఠం చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రదర్శన ఇచ్చేందుకు వచ్చిన కల్యాణ్ గుండెపోటుతో మృతి చెందడడంతో తోటి కళాకారులు కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

ఇచ్ఛాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం సవరదేవిపేట(పేటూరు) వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లొద్దపుట్టి గ్రామానికి చెందిన దుర్గాశి మహేష్(45) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రేషన్ డీలర్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లొద్దపుట్టి గ్రామం పెద్దవీధికి చెందిన మహేష్ మంగళవారం రాత్రి వరకు రేషన్ పంపిణీ చేశాడు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో తన గ్రామ సమీపంలో ఉన్న సవరదేవిపేట నుంచి నడిచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో మహేష్ రోడ్డుపై పడిపోవడంతో తలకి తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మహేష్ భార్య కొన్నాళ్ల కిందటే అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం అయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒడిశా రాష్ట్రం జరడా పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతకు ఉపాధి కల్పించాలి

నరసన్నపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వలసల నివారణకు గాను యువతకుఉపాధి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సనపల నర్సింహులు, కొన్నశ్రీనివాసరావు కోరారు. బుధవారం నరసన్నపేటలో సీపీఐ మండల మహాసభలు నిర్వహించారు. పహల్గామ్ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారతీయులకు, పాకిస్తాన్‌పై దాడిలో ఆశువుల బాసిన సైనికులకు నివాళలు అర్పించారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల కార్యదర్శిగా రుద్రాక్ష అరవింద్, సహాయక కార్యదర్శిగా భాస్కరరావు, కార్యవర్గ సభ్యులుగా తొమ్మిదిమందిని ఎన్నుకున్నారు కార్యక్రమంలో నెయ్యల నారాయణరావు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగా ఒక్క మంచి పనైనా చేశారా?

పలాస, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో మంత్రిగా సీదిరి అప్పలరాజు నియోజకవర్గంలో ఒక్క మంచి పనైనా చేశారా అని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావు విలేకరులతో మాట్లాడుతూ.. బుద్ధి మాంద్యంతో మాజీమంత్రి అప్పలరాజు పేటీయం బ్యాచ్‌లతో కలిసి ధర్నాలు చేయడం దారుణమన్నారు. గడచిన ఏడాది కాలంలో రాష్ట్రంతో పాటు పలాస నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఎన్నడూ జరగలేదని ఉదహరించారు. కార్యక్రమంలో పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్, ఏఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాస్, యువజన నాయకుడు మలిపెద్ది నరేంద్ర (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషకు అభినందన

పలాసరూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అండమాన్ నికోబార్ కేంద్ర పాలిత ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు పలాస టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శిరీష నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటుపడడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అండమాన్ టీడీపీ కార్యదర్శి బొడ్డు కాంతారావు, సంయుక్త కార్యదర్శి పోతనపల్లి దుష్యంత్, బొడ్డు పాపారావు, పలాస టీడీపీ నాయకులు కుత్తుమ లక్ష్మణరావు, పీరికట్ల విఠల్, కిక్కర ఢిల్లీరావు, ఎం.కుమారరాజా, మాజీ సర్పంచ్ కె.మాధవరావు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌కు సత్కారం



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

హరిపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డా.పి. విజయ్‌కుమార్‌ను జనసేన జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు, నీటి సంఘం అధ్యక్షుడు పైల నాగార్జున ఆధ్వర్యంలో పలువురు నేతలు శ్రీకాకుళంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. మందస, పలాస ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు రుంకు తారకేశ్వరరావు, హనుమంతు జనార్దన పాల్గొన్నారు.

అరాచక పాలన అంతమొంది ఏడాది

● జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్



శ్రీకాకుళం అర్బన్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

శ్రీకాకుళం అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక, రాక్షస పాలన అంతమై ఏడాదై.. రాష్ట్రంలో సుపరిపాలన ప్రారంభమయిందని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. బుధవారం నగరంలోని ఎన్‌టీఆర్ మునిసిపల్ మైదానంలో మహిళలకు, జనసేన పార్టీ వీరమహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ పరిపాలనలో ప్రజలు పూర్తిగా విసిగివేసారిపోయి చిత్తుగా ఓడించారన్నారు. ఇటువంటి రోజును ప్రజలు పండగలా చేసుకోవాలనే ఉద్దేశంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్దపుడి విజయ్‌కుమార్, దానేటి శ్రీధర్, మజ్జి భాస్కర్, కొండా వర ప్రసాద్, రావాడ కామేష్, పలువురు వీర మహిళలు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు విముక్తి దినం

ఆమదాలవలస, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాక్షస పాలనకు విముక్తి కలిగి సుపరిపాలనకు ఏడాది పూర్తయిందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని వన్‌వే జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు దీపావళి పండగ జరుపుకున్నామన్నారు. గత వైసీపీ అరాచక పాలన ముగిసి ఏడాది పూర్తయిందని, కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సంద ర్భంగా బాణసంచా కాల్చి సందడి చేశారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేత లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ సూరపునాయుడు, సనపల ఢిల్లీశ్వరరావు, పైడి మురళీ మోహన్, నేతింటి జ్యోతి, నాగళ్ల మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు.

'వైసీపీ పీడ విరగడై..'

టెక్కలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ పీడ విరగడై ఏడాది అయినంటూ జనసేన పార్టీ నేతలు బుధవారం సంబరాలు నిర్వహించారు. బుధవారం రాత్రి జనసేన కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి సందడి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుపరిపాలనకు కూడా ఏడాదైందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కణితి కిరణ్‌కుమార్ అన్నారు. జగన్ ముఠా ఐదేళ్ల పాటు దోపిడీలు, అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ప్రజలు వారికి బుద్ధి చెప్పినా ఇప్పటికీ వారికి జ్ఞానోదయం కలగలేదన్నారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం

రణస్థలం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విష్వక్సేన్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా దేరసాం, పైడిభీమవరం, బొంతు వలస గ్రామాల్లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వడ్డాది శ్రీనివాస రావు, దన్నాన రవీంద్ర, బొంతు విజయ్ కృష్ణ, బసవ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: ముగ్గులను పరిశీలిస్తున్న నేతలు, పాల్గొన్న వీర వనితలు

రాష్ట్రంలో సుపరిపాలన

ఇచ్ఛాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మంచి సుపరిపాలన అందించిందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వేడుకలు నిర్వహించారు. వీకే పేట జంక్షన్ వద్ద పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ జంక్షన్‌కు ర్యాలీగా చేరుకుని వీర మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిప్పన దుర్యోధనరెడ్డి, డొక్కరి ఈశ్వరి శారద, డి.శేఖర్, ఆర్.భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: బస్టాండ్ జంక్షన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న జన సైనికులు, నేతలు

ఖరీఫ్‌నకు కాలువలను సిద్ధం చేయాలి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



రైతులకు డ్రోన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి తదితరులు

నరసన్నపేట/పోలాకి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి వంశధార కాలువల్లో పూడికలు తొలగించి సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వంశధార, ఇరిగేషన్, నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం, ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక నిధులతో చేపడుతున్న పనులను పూర్తి చేయాలన్నారు. శివారు భూములకు సాగునీరందేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు.

యాంత్రీకరణకు చర్యలు

వ్యవసాయంలో యాంత్రీకరణ విధానాలను చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో రాయితీపై మంజూరైన డ్రోన్లను అందజేశారు. సాంకేతిక విధానంలో వ్యవసాయాన్ని సులువు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, నరసన్నపేట, పోలాకి, మేఘవరం నీటి సంఘాల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, కోరాడ నాగరాజు, బైరి భాస్కరరావు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఏవోలు చిరంజీవిరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోండి

● ఎమ్మెల్యే గౌతు శిరీష



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న జాబ్‌మేళాలో డాక్టర్ రెడ్డీస్, టీపీఓ డిజిటల్ ఇండియా, దివీస్, హెటిరో, డైకిన్ వంటి 15 బహుళ జాతి కంపె నీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బిఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు ఉన్న యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు నైపుణ్యం.ఏపి.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకో వాలన్నారు. ఇతర వివరాలకు 908590730, 6301045132 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, నేతలు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల త్యాగాలతోనే ప్రాజెక్టులు పూర్తి

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

మెళియాపుట్టి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలోని నిర్వాసితుల త్యాగం వల్లే ఇటు వంశధార, అటు ఆఫ్‌షోర్ ప్రాజెక్టులు పూర్తవుతున్నాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామమైన చీపురుపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనకు ప్రయోజనం లేకపోయినా ఇతర మండలాలకు సాగు, తాగు నీరందించేదుకు నిర్వాసితులు భూములను త్యాగం చేయడం అభినందనీయమన్నా రు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వాసితుల సమస్యలు పట్టికోకపోయినా కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందన్నారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ.. నిర్వాసి తులకు సంబంధించిన ఏ ఒక్క సమస్య పెండింగ్‌లో ఉంచకుండా వాటిని పరిష్కరించి న్యాయం చేయడం జరుగుతుం దన్నారు. సుమారు 40 మంది వరకు ప్యాకేజీ రాలేదని ఫిర్యాదు చేశారని.. అయితే 25 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వనట్లు గుర్తించామన్నారు. త్వరలోనే సమ స్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రాము, ఎంపీడీవో ప్రసాద్ పండా, టీడీపీ నాయకులు సలాన మోహనరావు, అనపాన రాజశేఖరెడ్డి, కృష్ణారావు, కదంబల రాజు, బాజ్జి, పరమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్డమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

నందిగాం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాంపురం పంచాయతీ చిన్నలక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన జడ్డమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ప్రారంభ మయ్యాయి. పురోహితులు శతపతి ప్రసాదరావు శర్మ, ఇతర రుత్వికుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన్, మండపారాధన, యాగశాల ప్రవేశం, గ్రామ ప్రదక్షిణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

హాలహాలేశ్వర స్వామి ఆలయంలో పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

నరసన్నపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ రాంపాడు హలహలేశ్వర స్వామి ఆలయ పునః ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం సత్యవర అగ్రహార రుత్వికులు ప్రత్యేక పూజాదికార్యాక్రమాలను నిర్వహించారు. సంకల్పం, మండపారాధన, మహాలింగార్చన, నవగ్రహ జపాలు, పంచశయ్యాధివాసాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి హోమం



చిన్నదూగాంలో నిర్వహించిన శాంతి హోమంలో పాల్గొన్న భక్తులు

జలుమూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చిన్నదూగాంలో పాతపట్నం అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా బుధవాం గ్రామస్థులు శాంతి హోమం నిర్వహించారు. గ్రామ పురోహితులు బంకుపల్లి వెంకట అప్పల కృష్ణారావు నేతృత్వంలో గ్రామానికి చెందిన పీస శ్రీనివాసరావు, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం గ్రామస్థులు సహకారంతో శాంతి హోమం నిర్వహించినట్లు పురోహితులు తెలిపారు. పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులకు ఉపయోగపడేలా పనులు



కడపలగెడ్డ వద్ద చెక్ డ్యాం పనులను పరిశీలిస్తున్న డీఈ రామకృష్ణ

ఎల్.ఎన్.పేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వంశధార కుడిప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువల్లోని పూడికతీత, చెక్‌డ్యాంలు, రక్షణ గోడల పనులు నిబంధనల మేరకు చేపడుతున్నామని వంశధార ప్రాజెక్టు డీఈ రామకృష్ణ తెలిపారు. తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య 7ఎల్ కాలువ కడపలగెడ్డలో చేపట్టిన పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్ల కాలువల పరిధిలోని ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలిగేలా సకాలంలో పనులు పూర్తి చేస్తామన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని లేకుంటే బిల్లులను నిలుపుదల చేస్తామన్నారు. ఏఈలు శ్రీనివాసరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలమల్లన్న ఆదాయం రూ.1.49 లక్షలు

టెక్కలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రమైన రావివలస ఎండలమల్లికార్జునస్వామి హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. 96 రోజులకు గాను రూ.1,49,766 వచ్చినట్లు ఈవో జి.గురునాథరావు తెలిపారు. తహసీల్దార్ రవికుమార్, దేవదాయశాఖ ఈవో మనస్వి, అర్చకులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మాఫీ చేయాలి

టెక్కలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించిన రుణాలు మాఫీ చేయాలని కుల నిర్మూలన పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం నిలుపుదల చేసిన అన్ని సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ కులగణన జరిగేంత వరకు ప్రభుత్వం వర్గీకరణ నేపథ్యంలో తీసుకొని వచ్చిన ఆర్డినెన్స్‌ను నిలుపుదల చేయాలని కోరారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన దుమ్ము ఏకాంబరం ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో కుడికాలు తెగిపోయి ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రష్యాలో ఉన్న ఆంధ్రామిత్రుల సంఘం సభ్యులు దున్న వల్లప్పగారి జోగారావు, బెజ్జి మోహన్, తామాడ చిరంజీవి, తిమ్మల మోహన్ దాతలు నుంచి విరాళాలు సేకరించారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.59 వేలు నగదును బుధవారం అందించారు.

న్యూస్ బాక్స్

రుచికరమైన భోజనాలు అందించాలి

నందిగాం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు రుచికరమైన భోజనాలు వండిపెట్టాలని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో కుక్ కమ్ హెల్పర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాణ్యతతో కూడిన వంటకాలు అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, కిచెన్ గార్డెన్‌లు నిర్వహించాలని సూచించారు. డీఆర్పీ భాగ్యలక్ష్మి సూచనలు, సలహాలు ఇచ్చారు.

మెనూ నిర్వహణపై అవగాహన

పాతపట్నం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మెనూ నిర్వహణపై కుక్‌లు, సహాయకులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో సీహెచ్ తిరుమలరావు అన్నారు. స్థానిక ఆల్‌ఆంధ్రా రోడ్డు కూడలిలోని ఎంపీపీ స్కూల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కుక్‌లకు, సహాయకులకు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. న్యూట్రీ గార్డెన్ నిర్వహణపై దృష్టి సారించా లన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎస్.వైకుంఠరావు, పి.కృష్ణారావు, ఎస్.రామారావు, పాల్గొన్నారు.

దళిత రైతులకు బోర్లు మంజూరు చేయాలి

సంతబొమ్మాళి,జూన్4(ఆంధ్రజ్యోతి): దళిత రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోర్లు సోలార్ ప్లాంట్ సబ్సిడీలో అందించాలని దళిత నాయకుడు బోరుభద్ర నేత చింతాడ చిన్నారావు కోరారు. బుధవారం శ్రీకాకుళం వచ్చిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు అందిస్తున్న యూనిట్లు ఐదు వందలకు పెంచి వారు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పాలపోలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మెళియాపుట్టి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జలగలింగుపురం గ్రామంలో పాలపోలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ గురువారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నూతనంగా నిర్మించిన గుడిలో విగ్రహ ప్రతిష్ఠ చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

వీఆర్వోపై ఫిర్యాదు

హరిపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మందస మండలం కొంకడాపుట్టి గ్రామ సచివాలయ వీఆర్వో ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని గిరిజన సంఘం నాయకురాలు, మాజీ సర్పంచ్ సవర సాంబేరమ్మ ఐటీడీపీ పీవోకు ఫిర్యాదు చేశారు. నెలల తరబడి సచివాల యానికి రావడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

జలుమూరు/నరసన్నపేట/ పాతపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగసనాల సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పలువురు అధికారులు పేర్కొన్నారు. బుధవారం జలుమూరు, నరసన్నపేట, పాతపట్నంలలో ప్రభుత్వ ఆదేశాలతో యోగాంధ్ర-2025 నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు యోగాసనాలు వేశారు.